

# మంత్రిగారి జనసంపర్కం

**-గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు**

ఆ రాష్ట్ర ప్రభుత్వంలోని (మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాదు) మంత్రులెవ్వరూ జనంలోకి వెళ్ళటం లేదని ప్రతిపక్షాలు కాకిగోల చేస్తున్నాయి. దాన్ని తిప్పికొట్టటానికి స్వయానా మంత్రిగారే జనంలోకి కదిలారు. ఆ కార్యక్రమం పేరు, 'జన సంపర్కం'. అంతా పారదర్శకంగా ఉండాలి కనక ఆ పేటలో పేరు పొందిన పెద్ద ఫంక్షన్ హాల్ ఆవరణలో పెద్ద షామియానా కింద, ఆ ఆదివారంనాడు మంత్రిగారు జనంతో ముఖాముఖీగా మాట్లాడటానికి ఏర్పాటయింది. స్వయంగా మంత్రిగారితో మాట్లాడుకుంటామన్న జనాన్ని, పార్టీ వలంటీర్లు ముందు వరసల్లో కుర్చీల్లో సగౌరవంగా కూర్చోబెట్టి, ఒక్కొక్కర్నే మంత్రిగారి టేబిల్ దగ్గరికి పంపిస్తున్నారు.

ముందరగా ఆ డివిజన్ పెద్దలు, సంతకాల్తో ఉన్న తమ విన్నపం కాగితాన్ని మంత్రిగారి చేతిలో పెట్టి చెప్పుకొన్నారు: 'సార్, కార్పొరేషన్ పంపు గొట్టాల్లోంచి మంచినీళ్ళకు బదులు మురికినీళ్లొస్తున్నాయి. అవి తాగితే విరేచనాలొస్తున్నాయి. తాగకపోతే ప్రాణాలు నొస్తున్నాయి.. పైగా ఆ పంపుల దగ్గర పడిన గోతుల్లో దోమలు పెరిగిపోతున్నాయి... ...'

మంత్రి, తన పక్కనున్న తన సెక్రటరీ వైపు ప్రశ్నార్థకంగా చూశాడు. ఆ సెక్రట్రీ లోగొంతుతో అన్నాడు, 'ఎట్లాగూ మీరు ఫిల్టర్ల ఫ్యాక్టరీ పెడుతున్నారు గదా్సర్!...'

మంత్రి మొహం వెలిగింది. కానీ వెంటనే ఆ మొహంలోకి విచారం తెచ్చుకుని ఆయన ఆ పెద్దల్తో అన్నాడు, 'అయ్యయ్యో, ఘోరం జరిగిపోతోందన్నమాట!... సరే, ఒక్కొక్కరికీ ఒక్కొక్క ప్లాస్టిక్ గొట్టం ఉచితంగా సప్లై చేయిస్తాను. అందులో ఒక్కో దాంట్లో ఆరు ఫిల్టర్లు చొప్పున ఉంటాయి. ఆ గొట్టాన్ని మీరు పంపుకి తగిలించి మీరు నీటిని పీల్చి తాగండి. ఆ ఫిల్టర్లు నీటిని వడపోసి మీ నోట్లోకి పంపిస్తాయి. స్వచ్ఛమైన నీరు తిన్నగా మీ నోట్లోకొస్తుంది... అయితే, వారానికోసారి మాత్రం మీ సొంత ఖర్చుతో మీరు ఫిల్టర్లను మార్చుకోవాలి... ఇంకా, ఆ గుంటల్లో నాటటానికి రంగురంగుల నీటి కలువ మొక్కల్ని సప్లై చేయిస్తాను. చక్కని పూలూ పూస్తాయి, దోమా ఛస్తుంది!'

ముందు వరసలో కింద కూర్చోనున్న పార్టీ కార్యకర్తలు, 'జిందాబాద్, మన ప్రియతమ మంత్రివర్యులకూ జిందాబాద్!' అని నినాదాలు చేశారు. ఆ గోలలో మంత్రిగారికి సమాధానం ఏం చెప్పటానికీ తోచక పెద్దలు తికమకలో పడిపోయారు. వలంటీర్లు వాళ్ళని 'వివరాలు వారితో తర్వాత మాట్లాడుకోండి' అంటూ గబగబా వారిని వెనక్కి తోసేశారు.

ఒక నలభయ్యేళ్ల యువకుడు ముందుకొచ్చాడు. 'సార్ నేను పోలీసు కానిస్టేబుల్ని. స్నిఫర్ డాగ్ (వాసన పట్టే కుక్క) ఇన్‌ఛార్జిని. మన విధాన భవనం చుట్టూ మామూలుగానే ఆ రోజున కూడా ఉదయం వ్యాయామానికి నా కుక్కని నడిపించుకొని వెడుతున్నాను. హఠాత్తుగా అది నా చేతుల్లోంచి గుంజుకుని పక్కనున్న పొదల్లోకి పారిపోయింది.... సూపర్నెంటుగారు నన్ను సస్పెండు చేశారు. జీతం లలేదు. తమరే నన్ను కాపాడాలి!'

అయోమయంగా మంత్రి అన్నాడు, 'అది పొదలోకెడితే నిన్ను సస్పెండు చెయ్యటమేంటి?... ఇంతకీ ఆ పొదలో ఏముంది?'

'ఒక బలిసిన మగ కుక్క సార్!'

'అప్పుడేమయ్యింది?'

'మరి, మరి... ఒక మగ జీవి దగ్గరికి, తగుదునమ్మా అంటూ ఒక ఆడజీవి వెడితే, ఏమవుతుంది సార్!... అదే అయ్యింది సార్... అది నా తప్పా సార్!'

సాలోచనగా మంత్రి, 'ఊ... సరే, ఇంతకీ అక్కడేమయ్యిందయ్యా?'

'అది చూళ్లేదు సార్, నా కుక్క మాత్రం ఆ తర్వాత గర్భవతి అయ్యింది సార్!... ఆరు పిల్లల్ని కూడా పెట్టింది!'

చటుక్కున సెక్రటరీ ముందుకు వంగి మంత్రి చెవిలో అన్నాడు. 'సార్, తమ మనవడికి ఆడుకోటానికి కుక్కపిల్లల్ని కొనాలనుకుంటున్నాం గదా్సర్... ఆలోచించండి!'

ఇది పసిగట్టిన కానిస్టేబుల్ అన్నాడు. 'స్వయంగా సూపర్నెంటుగారే ఒక్కొక్కటి నాలుగువేలు చొప్పున నాలుగు పిల్లల్ని అమ్మేసార్సార్. అందంగా ఉన్నాయి గదా, అందుకని!'

మంత్రి మొహం వెలిగింది. 'ఇంకో రెండున్నాయన్న మాట... సరే, ఓ పని చెయ్యి. వాటిని తీసుకొచ్చి మా సెక్రట్రీకి అప్పగించు.. నీ సస్పెన్షన్ ఎత్తేసి జీతం ఇచ్చెయ్యమని మీ సూపర్నెంటుతో నే చెప్తాన్లే!'

'థాంక్స్, సార్, థాంక్స్' అంటూ విప్పారిన మొహంతో కానిస్టేబుల్ వెళ్ళిపోయాడు.

ఒక యాభై ఏళ్ల ఉద్యోగిని ముందుకొచ్చింది. 'మీతో ఇంటర్వ్యూ దొరకటం లేదా్సర్... అందుకని ఈ జనంలోకొచ్చాను. డాక్టర్ని... కొంచెం పర్సనల్‌గా...'

మంత్రి తన సెక్రటరీని కలుపుకొని, లేచి, ఆమెతో కలిసి ఫంక్షన్ హాల్ గదిలోకెళ్ళాడు. ముగ్గురూ అక్కడి కుర్చీల్లో కూర్చున్నారు.

ఆమె అంది 'నా పేరు పుత్రవతి. షిమోగా జిల్లా కేంద్ర ఆస్పత్రిలో డాక్టర్ని. నన్ను మా డైరెక్టర్ హెరాస్ చేస్తున్నాడా్సర్!'

మంత్రి కోపంగా అన్నాడు. 'ఎంత దారుణం!... ఈ రోజుల్లో ఆడది కనిపిస్తే ప్రతి మగాడికీ రెపరెప లాడిపోతోందని తెలుసు కానీ, మరీ ఇంత దారుణమా... ఉండు' ఇల్లా అంటూ మంత్రి, ఆరోగ్య శాఖ డైరెక్టరుతో సెల్‌ఫోన్లో మాట్లాడాడు. క్రమంగా మొహం ముడుచుకుపోగా, ఫోను కట్టేసి ఆమెతో చిరాగ్గా అన్నాడు. 'నీ ఉద్యోగం శివరంగ పట్నంలో అయితే, నువ్వెప్పుడూ ఈ రాజధానిలోనే ఉండి సెలవులు పెడుతూంటావటగా!

'సార్ నేను పోలీసు కానిస్టేబుల్ని. స్నిఫర్ డాగ్ (వాసన పట్టే కుక్క) ఇన్‌ఛార్జిని. మన విధాన భవనం చుట్టూ మామూలుగానే ఆ రోజున కూడా ఉదయం వ్యాయామానికి నా కుక్కని నడిపించుకొని వెడుతున్నాను. హఠాత్తుగా అది నా చేతుల్లోంచి గుంజుకుని పక్కనున్న పొదల్లోకి పారిపోయింది.... సూపర్నెంటుగారు నన్ను సస్పెండు చేశారు. జీతం లలేదు. తమరే నన్ను కాపాడాలి!'

అందుకని నిన్ను షిమోగాకు బదిలీ చేశార్ట. ట్రాన్స్‌ఫర్ చెయ్యటం హెరాస్‌మెంట్ ఎల్లా అయిందమ్మా!'

ఇంచుమించు ఏడుపుతో పుత్రవతి అంది. 'సార్, నాకు ముగ్గురూ ఆడపిల్లలే సార్. నా భర్త బీరు కంపెనీలో పని చేస్తున్నాడు. ఆ కంపెనీ వారు ఈ మధ్య ఇంక్రిమెంట్లు, బోనస్‌లకు బదులుగా బీరు కేసులు ఇంటికి పంపిస్తున్నారు. ఒక్కరోజు నేను ఇల్లు చూసుకోకపోతే పెళ్ళికాని నా ముగ్గురు కూతుళ్ళూ చేతుల్లో ఈ బీరు బాటిల్స్‌తో ఏ అర్ధరాత్రివేళో రోడ్డు మీద పోలీసులకి దొరికిపోతారేమోనని నా భయం సార్! అందుకనే సెలవులు పెట్టి ఈ రాజధానిలోనే ఉండిపోవలసొస్తోంది సార్! పోనీ నన్ను షిమోగా నించి ఈ రాజధానికే ట్రాన్స్‌ఫర్ చేయించి పుణ్యం కట్టుకోండి సార్!'

సెక్రటరీ వంగి, మంత్రి చెవిలో ఏదో ఊదాడు. మంత్రి చటుక్కున 'సరేనమ్మా నీ క్షోభ అర్థమయింది. నా డివిజన్‌లోని హెల్త్ సెంటర్‌కి - ఈ రాజధానికి ట్రాన్స్‌ఫర్ చేయిస్తాను. మా బంగ్లాలో అనారోగ్యం కారణాల్తో మాటిమాటికీ సెలవులు పెట్టే మా సిబ్బందినీ, అవసరమైనప్పుడు నా అనారోగ్యాన్నీ కనిపెట్టుకునుందువుగాని!'

పుత్రవతి లేచి నమస్కరించి, ఆనందంగా 'థాంక్స్ ఏలాట్ సార్!' అంటూ వెళ్ళిపోయింది.

మంత్రీ సెక్రటరీలు కూడా బయటకొచ్చి షామియానా కింద తమ మామూలు చోటుల్లో కూర్చున్నారు.

వలంటీర్లను తోసుకుంటూ, ఒక బక్కరైతు ముందరకొచ్చాడు. 'బాబూ, పత్తిపంట ఏసి ఏసి, అది పండక, సుత్తిలాటోణ్ణి ఇట్టా వొత్తిలాగయిపొయ్యాను. తమరు రచ్చించకపోతే నా పని చావే'

మంత్రి, సెక్రటరీ వైపు చూశాడు.

సెక్రటరీ రైతుతో అన్నాడు. 'ఇట్లాంటి వాళ్ళకి బడ్జెట్‌లో ఏం ప్రొవిజన్ ఉందో ఆఫీసర్లు చెప్పాలి. నీ పని సుఖంగా జరగాలంటే నువ్వు విధాన భవనం ఆఫీసుకు రావాలి'

రైతు కస్సుమన్నాడు. 'ఏంటీ, నేను సుకంగా చావాలంటే కొట్టుకుంటా ఆపీసుకు రావాలా! అంతెందుకు, ఆ పని ఇక్కడే చేత్తా!' ఇట్లా అంటూ అతగాడు తన పంచె పోక ముడిలోంచి చిన్న సీసా తీసి, దాని సీలు విప్పి ఆ ద్రవం తాగబోయాడు!'

వలంటీర్లు చటుక్కున ముందుకు దూకి ఆ సీసాని లాగి అవతలకి గిరవాటేశారు. జనంలోంచి చిన్న మోతాదు గందరగోళం లేచింది. మంత్రి ఆందోళనగా సెక్రటరీ వైపు చూశాడు. సెక్రటరీ తన అయిదు వేళ్లు చూపాడు. మంత్రి తన లాల్చీ జేబులోంచి వెయ్యి కాగితాలు ఐదు తీసి ఆ రైతు చేతిలో పెట్టాడు. జనంలోంచి, 'ప్రియాతి ప్రియమైన మంత్రి గారికీ జై' అనే నినాదాలు మిన్నుముట్టాయి.

సెక్రటరీ అన్నాడు, 'ఇదుగో మళ్ళీ పంట వేసేటప్పుడు మంత్రిగారి తమ్ముడి డిపోలో విత్తనాలు కొను. అవ్వి ఫస్టుక్లాసయిన విత్తనాలు.. మర్చిపోకు'

'సిత్తం, సిత్తం' అంటూ ఆ నోట్లు లెక్కపెట్టుకుంటూ ఆ రైతు అక్కణ్ణించి కదిలాడు.



సార్. తమ ప్రభుత్వం అన్ని కోర్సులకీ ఫీజులు అమాంతంగా పెంచేసింది. మా అమ్మాయికి ఎంసిఏ లో సీటొచ్చింది. పాత ఫీజుల్ని నమ్ముకొని నేను దాచుకొన్నది ఇరవై వేలు మాత్రమే. ఇప్పుడు యాభై వేలు కట్టాలిట. కట్టలేను. తమరే దారి చూపాలి!

ఒక నడివయస్సు ఉద్యోగి తన ఇరవయ్యేళ్ల కూతుర్ని వెంటబెట్టుకుని వచ్చాడు. 'సార్, తమ ప్రభుత్వం అన్ని కోర్సులకీ ఫీజులు అమాంతంగా పెంచేసింది. మా అమ్మాయికి ఎంసిఏ లో సీటొచ్చింది. పాత ఫీజుల్ని నమ్ముకొని నేను దాచుకొన్నది ఇరవై వేలు మాత్రమే. ఇప్పుడు యాభై వేలు కట్టాలిట. కట్టలేను. తమరే దారి చూపాలి!'

సెక్రటరీ మంత్రి చెవిలో అన్నాడు. 'మీరు రెండేళ్ల కిందట పెట్టిన కాలేజీ ఉంది గద్సార్'

చిరునవ్వు నవ్వుతూ మంత్రి ఆ చిరుద్యోగితో 'మా కాలేజీలో చేర్పించు. నీ దగ్గర్నించి యాభై వేలు కాదు, నలభై వేలే పుచ్చుకోమని ప్రిన్సిపాల్‌కు చెబుతాను... ఇరవై వేలు నేనిప్పుడు నీకు సహాయం అందిస్తున్నాను, ఇంద' అంటూ, తన లాల్చీ జేబులోంచి డబ్బు తీశాడు. అది పదివేలే. వెంటనే సెక్రటరీతో 'కార్లో అమ్మగారినడిగి ఓ పదివేలు పట్రా' అన్నాడు. సెక్రటరీ వెళ్ళాడు.

ఈ అమ్మాయి ఏడుపు మొహం పెట్టి తండ్రితో 'ఆ కాలేజీలో ఎవ్వరూ చేరరు నాన్నా. అసలక్కడ బోర్డు తప్ప ఇంకేం లేదు. అక్కడ నేను చేరను' అంది.

సెక్రటరీ పది వేలు తెచ్చిచ్చాడు మంత్రికి. మంత్రి మొత్తం ఇరవైవేలునూ ఆ ఉద్యోగి చేతుల్లో పెట్టాడు. 'ఇట్నించిటే కాలేజికి వెళ్ళిపోండి. మీతో మా వలంటీర్ వస్తాడు. నా రికమండేషన్ విషయం చెప్పటానికి' అన్నాడు.

'థాంక్స్ సార్' అని ఆ చిరుద్యోగి తన కూతుర్ని ఈడ్చుకుంటూ ఆ వలంటీర్‌తో కలిసి వెళ్ళిపోయాడు.

జనంలోంచి 'జై' నినాదాలు మళ్ళీ ఆకాశాన్నంటాయి.

ఇంకో అయిదారుగురితో 'సంపర్కం' అయ్యాక మంత్రి, ప్రజల, పార్టీ వాళ్ల, వలంటీర్ల జయజయ ధ్వానాల మధ్య తన కారెక్కాడు.

* * *

కారు వెడుతూండగా మంత్రి భార్య మంత్రితో అంది. 'ఇందాకన తీసుకున్న నా పదివేలూ ఎప్పుడిస్తారు?'

మంత్రి అలవోకగా నవ్వాడు. 'పదివేలకు సరిపడా ప్రభుత్వం బాండ్లు ఇప్పిస్తాలే... అయినా అసలు నీకు డబ్బెందుకు?'

మంత్రి భార్య మొహం ముడుచుకుంది. క్షణాల్లో ఆమెలో కోపం తారాస్థాయికి చేరుకుంది. 'ఏంటీ, తమాషాగా ఉందా? నేను 'జన సంపర్కం' సరుకుననుకున్నారా, తిరగేసి వాడుకోటానికి...! ఏయ్ షోఫర్, కారాపు!' అంది.

డ్రైవర్ పక్కనున్న సెక్రటరీ చటుక్కున వెనక్కి తిరిగి ఆమెతో 'అది కాదు మేడమ్, డాలర్లు అనబోయి బాండ్లు అన్నారు సారు... అంతే కద్సార్' అన్నాడు.

మంత్రి, సెక్రటరీ వైపు ప్రసన్నంగా చూశాడు.

సెక్రటరీ అన్నాడు 'సార్, కంట్రాక్టర్ కోలార్ రాజుకు ఫోన్ కొట్టమంటారా సార్, 'నువ్విచ్చిన పార్టీ ఫండు లక్షా కాస్తా జనసంపర్కంలో ఖర్చయిపోయింది. ఇంకో లక్ష పంపు! అని!'

ఆనందంతో మంత్రి మూర్ఛపోయినంత పని చేశాడు.

* * *

కాగా,,, టీవీ ఛానెళ్లూ, ఆ సాయంకాలం పత్రికల ఎడిషన్లూ, మంత్రిగారి 'జనసంపర్కం' అద్భుతంగా విజయవంతమైన విషయాన్ని వైనవైనాలుగా ఘోషించాయి.

ప్రతిపక్షాలు నోరెళ్ళబెట్టాయి!

*

**నీతి:** మంత్రిగా రాణించాలంటే చాణక్యుడు లాంటి సెక్రటరీ ఉండాలి. *


<u>రచయిత చిరునామా</u>

గుండు సుబ్రహ్మణ్య దీక్షితులు

శ్రీ షణ్ముఖ నిలయం

పెద్దాడవారి వీధి

రామచంద్రరావుపేట, ఏలూరు - **534 002**.


# పశుపక్ష్యాదుల 'లైబ్రరీ'

లైబ్రరీల్లో మనకు పుస్తకాలనిచ్చినట్లుగానే అక్కడ మనకు కావలసిన పశుపక్ష్యాదులనూ ఇస్తారు. దీనిని లైబ్రరీ అనవచ్చునా? రకరకాల గ్రంథాలను ఒక్కచోటికి చేర్చి కేవలం సభ్యత్వ రుసుమును తీసుకుని ఉచితంగా తీసుకెళ్ళి చదివి తిరిగి ఇచ్చేందుకు కొన్ని లైబ్రరీలు మనకు అందుబాటులో ఉన్నాయి. పుస్తకాలు తీసుకెళ్ళి చదివి ఇచ్చినందుకు అద్దెలు వసూలు చేసే లైబ్రరీలూ ఉన్నాయి. ఇవన్నీ మనకు తెలుసు. కాని అది లైబ్రరీ కాదు. అక్కడ పుస్తకాలుండవు. కాని పశువులూ పక్షులూ అనేక రకాలవి అక్కడుంటాయి. కావాలనుకున్న వాళ్లు తమ కిష్టమైన పశువులనూ, పక్షులనూ తీసుకెళ్ళవచ్చు. వారం రోజుల తర్వాత తెచ్చి ఇవ్వాలి. వారం దాటితే రోజుకో పది సెంట్లు ఫైను కట్టాల్సి ఉంటుంది. సభ్యత్వ రుసుము లేదు. వారం రోజులుంచుకున్నందుకు చార్జీ ఏమీ ఉండదు. పిల్లలైతే ఏడు సంవత్సరాలు దాటి ఉండాలి. ఏడు సంవత్సరాల వయస్సు పైబడిన వారెవరైనా సభ్యులుగా చేరవచ్చు. ఆ మేరకు వయస్సును ధ్రువీకరించే పత్రాన్ని పిల్లలు మాత్రం సమర్పించుకోవాలి. పాములు, బల్లులు వంటి ప్రాకే జంతువుల్ని తీసుకెళ్లాలంటే మాత్రం తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. ఏ రకం ప్రాణినైనా తడవకు ఒక్కదానినే ఇస్తారు. ఒక్క జంతువును గానీ, ఒక్క పక్షిని గానీ ఒక్కరు తీసుకోవచ్చు. *50* సంవత్సరాల క్రితం 'జాన్ రిప్లే ఫర్ చిన్' అనే జంతు శాస్త్రజ్ఞుడు స్థాపించిన ఈ సంస్థ చాలామందిని ఆకర్షిస్తున్నది. ప్రకృతికి దూరమై పోతున్న పట్టణ వాసపు పిల్లలకు ఆనందాన్నీ, ఆహ్లాదాన్నీ, ఆరోగ్యాన్నీ చేకూర్చుతున్నదీ సంస్థ. ఆ సంస్థలో స్వేచ్ఛగా తిరిగి తన కిష్టమైన ప్రాణి నెన్నుకుని 'ఈ ప్రాణి నా దగ్గర ఉన్న రోజుల్లో దానికి ఏ విధమైన హానీ చేయను. దానిని బాధ పెట్టను' అని ఒక హామీ పత్రాన్ని మాత్రం తప్పకుండా రాసి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ సంస్థలో కుందేళ్లు, తెల్ల ఎలుకలు, ఉడుతలు, తాబేళ్లు, చేపలు, నక్కలు, పంది పిల్లలు, చిన్నచిన్న కొండచిలువలు వంటి అనేక ప్రాణులు చక్కటి వాతావరణంలో ఉంటున్నాయి.

ఈ సంస్థని కొన్ని ఆసుపత్రులు కూడా వాడుకుంటున్నాయి. అనారోగ్యంగా ఉన్న పిల్లలకు మానసిక ఆనందాన్ని కలిగించేందుకూ, తద్వారా వారు త్వరితంగా కోలుకునేందుకూ ఈ సంస్థ ఉపయోగపడుతున్నదన్న మాట. **-జయ సౌజన్యామూర్తిశ్రీ**